
సాక్షి ఒడిశా

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.59.149లు, బంగారం 520 మిల్లీగ్రాములు వెండి 109 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సాహంగా స్నాతకోత్సవం

ఐఐటీ భువనేశ్వర్‌లో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. 1388 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

- 8లో



డ్యామ్‌కు మరమ్మతులు

అప్పర్ కొలాబ్ డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టడంతో సతిగుడ జలాశయంలో నీటి కొరత ఏర్పడింది. దీంతో జయపురంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది.

- 8లో

న్యూస్‌రీల్

సామాజిక కార్యకర్తకు సత్కారం



తనూజాకు పురస్కారం అందజేస్తున్న సెంచూరియన్ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాఢి

పర్లాకిమిడి: ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో స్థానిక రాజవారి ప్యాలస్‌లో యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తనూజా శథపతిను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంచూరియన్ వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి పాల్గొన్నారు. ఇటీవల పూరీలో సంస్కృతీ భవన్‌లో సోషల్ యాక్టివిస్టు తనూజా శతపథికి 'ఇండియాన్ గ్లోరీ అవార్డు' ప్రదానం చేసిన సందర్భంగా పర్లాకిమిడిలో ప్రగతి మహిళా సంఘటన్ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బినోదినీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్ పట్నాయక్, భాగవత్ పాఢి, రామచంద్రపాఢి, హరిమోహన్ పట్నాయక్, లోకనాథ మిశ్రా, స్నేహాబెహేరా, బిచిత్రా నంద బెబర్తాలు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళి



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్లాకిమిడి: మాజీ ప్రధానమంత్రి దివంగత మన్మోహన్‌సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. స్థానిక రాజావారి ప్యాలస్ వద్ద శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బసంత పండా, డీసీసీ మాజీ అధ్యక్షులు బిభూతి ప్రాత్రో, మాజీ కౌన్సిలరు అభిమన్యు పండా, ఈశ్వర మఝి, అశోక్ అధికారి, రాజపాత్రో, ఛత్ర కాంగ్రెస్, యువ కాంగ్రెస్ నాయకులు రంజితా పాణిగ్రాహి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు షేక్ జాస్మిన్ రబి పాల్గొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ ప్రతిష్టా దినోత్సవ కార్యక్రమాలు ఏడు రోజుల పాటు నిలిపివేసినట్టు డీసీసీ అధ్యక్షులు దాశరథి గోమాంగో అన్నారు.

ఏఎస్ఐ అనుమానాస్పద మృతి



రేణు ప్రధాన్(ఫైల్)

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న రేణు ప్రధాన్ (40) మూడు రోజుల కిందట అదృశ్యం కాగా, శనివారం ఆయన మృతదేహాన్ని అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళదొర గ్రామంలో గుర్తించారు. రాయిసింగ్ నాలా సమీపంలో చెట్టుకు వేలాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోహనాలో స్వల్ప భూకంపం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనాలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్వల్పంగా భూమి కంపించినట్టు బీడీఓ లారీమన్ కర్సల్ తెలిపారు. మోహనాతో పాటు అడవ, చాందిపుట్, ఉహాగుడి, గంజాం జిల్లా తప్తపాణిలో నాలుగు సెకెన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు వచ్చారు.

రామావతారంలో వేంకటేశ్వరుడు



పూజలందుకుంటున్న స్వామివారు

పర్లాకిమిడి: స్థానిక కేవుటి వీధిలో ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా రోజుకో అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తున్నారు. శనివారం శ్రీరామావతారంలో దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఎ.రాజగోపాలచారి తిరుప్పావై ప్రవచనాలు చదివి వినిపించారు.

అన్నదాతలకు అభయం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

- పంట కోల్పోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటాం
- ఈ నెల 30 నాటికి పూర్తిస్థాయి నష్టం అంచనా
- సమీక్షలో సీఎం మోహన్‌చరణ్ మాఝి అభయం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అపార పంట నష్టం కలిగిందని, ఈ సమయంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అభయమిచ్చారు. పంట నష్టం, పరిహారానికి సంబంధించి శనివారం స్థానిక లోక్ సేవాభవన్‌లో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం వల్ల పంట కోల్పోయిన ప్రతి రైతుకూ పరిహారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ నెల 20 నుంచి 28 మధ్య రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంతో ఏ ఒక్క బాధిత రైతుకు కూడా సాయం అందని పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టంపై కచ్చితమైన అంచనాలతో వాస్తవంగా నష్టపోయిన రైతులను 30 రోజుల్లోగా గుర్తించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు బీమా, బీమా లేని రైతులందరికీ ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా సాయం అందిస్తామన్నారు. బీమా చేసిన రైతాంగం నిర్ణీత గడువులోగా పంట నష్టం సమగ్ర వివరాలను బీమా కంపెనీలకు అందజేయాలన్నారు. ఈ మేరకు అనుబంధ ప్రభుత్వ, అధికార వర్గాలు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫసల్ బీమా యోజన కింద పరిహారం కోసం లక్షా 26 వేల మంది రైతులు సమాచారం దాఖలు చేశారని, ఈ నెల 29 నాటికి పీడిత రైతాంగం బీమా పరిహారం మంజూరు కోసం తమ పంట నష్టం వివరాల్ని దాఖలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో బీమా లేని రైతాంగం పంట నష్టం వివరాల్ని కృషి రక్షక్ పోర్టల్ ద్వారా గానీ, 14447 నంబరుకు ఫోను చేసి గానీ తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయం, రైతు సాధికారత విభాగం మంత్రి కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, రెవెన్యూ విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, సహకార శాఖ మంత్రి ప్రదీప్ బొలో సామంత్, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలొ, ప్రత్యేక సహాయ కమిషనరు దేవ రంజన్ కుమార్ సింగ్, వ్యవసాయం, రైతు సాధికారత శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి, ఆహార సరఫరా,వినియోగదారుల సంక్షేమ శాఖ ప్రముఖ కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్, సహకార శాఖ కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్ పాల్గొన్నారు.

జనవరి మొదటి వారంలో..

చోళ్లు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



కొరాపుట్ జిల్లాలో సాగులో ఉన్న చోడి పంట

జయపురం: జనవరి మొదటి వారంలో చోళ్లు (మండియ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లా వ్యవసాయ విభాగం శ్రీఅన్న అభిజాన్ క్రమంలో చోళ్లు ఖరీదు చేసేందుకు జిల్లా స్థాయి క్రయ కమిటీ నిర్ణయించింది. గత ఏడాది లాగనే ఈసారి కూడా జిల్లాలో 48 చోడి మండీలు తెరవాలని భావిస్తున్నారు. 21 లేంపులు, ఫార్మర్స్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీల ద్వారా 2.39 క్వింటాళ్ల చోళ్లు ఖరీదు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. 30 వేల మంది రైతులు చోళ్లను సాగు చేస్తున్నారు. వీరిలో ఇంతవరకు ఎనిమిది వేల మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారుల సమాచారం. క్వింటా 4,290 రూపాయల చొప్పున కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. అంతే కాకుండా ప్రోత్సాహక నిధిగా క్వింటాకు రూ. 210 అదనంగా కలిపి మొత్తం రూ.4,500 రైతులకు చెల్లించనున్నారు. చోళ్లను కొనుగోలు చేసిన 72 గంటల్లో రైతు బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులను జమ చేయనున్నారు. గత ఏడాది రెండు లక్షల 50 వేల క్వింటాళ్ల చోళ్లు ఖరీదు చేయాలని లక్ష్యం పెట్టుకోగా.. 8,900 మంది రైతుల నుంచి కేవలం ఒక లక్షా 18 వేల క్వింటాళ్లను కొనుగోలు చేశారు.

ఆర్థిక సంస్కర్తకు అశ్రునివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్మిక సంఘ నేతలు

జయపురం: ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శనివారం జయపురంలోని యాదవ భవనంలో సిటీ కోఆర్డినేషన్ కమిటీ(పట్టణ కార్మిక, ప్రజాసంఘాల సమన్వయ కమిటీ) ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సమన్వయ కమిటీ ఉపాధ్యక్షులు నళినీకాంత రథ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ మంచి దక్షత గల ప్రజా నాయకుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలో దేశ గతినే మార్చేశాయని గుర్తు చేశారు. దేశ ప్రధానిగా అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయపురం సిటీ కో ఆర్డినేషన్ కమిటీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి జుధిష్ఠర్ రౌళో, రామకృష్ణ దాస్, గురు మాలి, బసంత బెహరా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా మావోయిస్టులు అరెస్టు



విలేకరుల ఎదుట హాజరుపరిచిన మహిళా మావోయిస్టులతో పోలీసు అధికారులు

మల్కన్‌గిరి: ముగ్గురు మహిళా మావోయిస్టులను శనివారం తెల్లవారుజామున మల్కన్‌గిరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరాపుట్ డీఐజీ నీతిశేఖర్ ఎదుట వారిని హాజరు పరిచారు. దీనికి సంబంధించి డీఐజీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రకొండ సమితి జోడాంబో పంచాయతీ గుంతబేడ గ్రామ సమీపంలో ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆంధ్రా–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ఏసీఎం క్యాడర్ మహిళా మావోయిస్టులుగా గుర్తించామని చెప్పారు. ఈ ముగ్గురిపై ఎనిమిది లక్షల రూపాయల రివార్డు ఉందన్నారు. అరెస్టయిన వారిలో స్వప్న అలియాస్ చంద్రమ్మఖీలో చిత్రకొండ సమితి డకార్‌పోధర్ గ్రామానికి చెందిన వ్యక్తి. ఈమె 2018లో ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి ఏసీఎం క్యాడర్‌కు చేరింది. ఈమెపై రూ. నాలుగు లక్షల ప్రభుత్వ రివార్డు ఉన్నట్టు చెప్పారు. అలాగే బబితా అలియాస్ కమల ఖీలో స్వగ్రామం డోంకాడ్ పోడర్. ఈమె 2021లో దళంలో చేరగా.. రెండు లక్షల రూపాయల రివార్డు ఉంది. అలాగే సునితా ఖీలో కూడ డోంకాడ్ పోదర్ గ్రామానికి చెందిన మహిళ. 2021లో ఆంధ్రా–ఒడిశా బోర్డర్ దళంలో సభ్యురాలుగా చేరగా.. ఈమెపై రూ. రెండు లక్షలు రివార్డు ఉందని వివరించారు. ఈ ముగ్గురు జిల్లాలోని అంద్రాపల్లి, గోంతబేప, తులసి పాహడ్, సుకుమా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారన్నారు. వీరిని పట్టుకున్న డీవీఎఫ్ జవాన్లను డీఐజీ నీతిశేఖర్ అభినందించారు.

కాలువ ఒడ్డున బాంబుల గుర్తింపు!



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాంబులు

భువనేశ్వర్: ఢెంకనాల్ కంకడ్‌పాల్ కాలువ ఒడ్డున ఎనిమిది పేలని బాంబులను శనివారం స్థానికులు గుర్తించారు. వెంటనే ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. దీంతో బాంబులను నిర్వీర్యం చేసే నిపుణలతో కలిసి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాంబులను పరిశీలించిన తరువాత వాటిని అక్కడ నుంచి తొలగించారు. అయితే బాంబులు ఇక్కడకు ఎలా వచ్చాయి, ఎవరి కోసం పెట్టారోనని స్థానికులు భయాందోళ వ్యక్తం చేస్తున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణికి సత్కారం



ప్రీతిస్మిత భొయిని సత్కరిస్తున్న సీఎం

భువనేశ్వర్: ఢెంకనాల్‌కు చెందిన 15 ఏళ్ల ప్రీతి స్మిత భొయ్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రపంచ రికార్డు నెలకొల్పి రాష్ట్రానికి గర్వ కారణంగా నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా సరికొత్త చరిత్ర ఆవిష్కరించి ప్రధాన మంత్రి జాతీయ బాల గౌరవ్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల అందుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ప్రీతిస్మిత భొయిని ప్రత్యేకంగా అభినందించారు. 76 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి ప్రపంచ స్థాయిలో కొత్త రికార్డును నెలకొల్పడంపై హర్షం వ్యక్తం చేశారు.

పట్టుబడిన అవినీతి తిమింగళం



సురేంద్ర తండిని అరెస్టు చేస్తున్న విజిలెన్స్ సిబ్బంది



ఏఆర్‌ఐ సురేంద్ర తండి

- ఆదాయానికి మించి 273 శాతం ఎక్కువగా ఆస్తులు
- కోటిపతి ఏఆర్‌ఐ అరెస్ట్
- ఈ నెల 31న రిటైర్‌మెంట్

జయపురం: ఆదాయానికి మించి ఆస్తులున్న కోటిపతి సహాయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కటకటాల పాలయ్యాడు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కుములి గ్రామంలో సహాయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సురేంద్ర తండి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అభియోగాలుండటంతో శుక్రవారం జయపురం విజిలెన్స్ అధికారులు అతడి ఆస్తులపై దాడులు నిర్వహించారు. సురేంద్ర తండి ఆదాయం కన్నా 273 శాతం ఎక్కువగా ఆస్తులు కలిగి ఉన్నట్లు జయపురం విజిలెన్స్ ఎస్పీ సురేంద్రనాథ్ ద్వివేదీ శుక్రవారం రాత్రి వెల్లడించారు. జయపురం విజిలెన్స్ సిబ్బంది బొరిగుమ్మలో గల అతడి నివాసం, అతడికి సంబంధించిన పలుచోట్ల ఏకకాలంలో దాడులు జరిపారు. బొరిగుమ్మలో అతడి నివాస భవనంతోపాటు ఝిలిమిలి గ్రామంలో రెండు వేల చదరపు అడుగుల వైశాల్యంలో గల రెండు భవనాలు, బొరిగుమ్మ పరిసర ప్రాంతాలలో 17 ప్లాట్లు, కొశాగుడ మౌజలో 2 ఎకరాల 29 డిసమిల్‌ల భూమి, ఝిలిమిలి మౌజలో రెండు డిసమల్‌ల ప్లాట్ ఉన్నాయి. బొరిగుమ్మలో అతడి నివాసంలో జరిగిన దాడులలో 152 గ్రాముల బంగారం నగలు, మూడు నాలుగు చక్రాల వాహనాలు, బైక్, రూ.లక్షా 55 వేల నగదు సీజ్ చేసినట్లు వెల్లడించారు. బ్యాంక్, పోస్టల్, బీమా కంపెనీల్లో రూ.84 లక్షలకు పైగా విలువ చేసే పత్రాలు ఉన్నాయన్నారు. మొత్తం రూ.కోటి 48 లక్షల నగదు ఉన్నట్లు వెల్లడించారు. సహాయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తండి చతుర్ధ శ్రేణి ఉద్యోగిగా చేరారు. గత కొన్నేళ్ల కిందట సహాయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ నెల 31వ తేదీన సురేంద్ర తండి రిటైర్ కానున్నారు. రిటైర్‌మెంట్‌కు ఐదు రోజు ముందు ఆదాయానికి మించి ఆస్తుల గల కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లాడు. అతడి న్యాయవాది బెయిల్‌కు పిటీషన్ వేయగా..విచారణ జనవరి 9వ తేదీకి వాయిదా వేశారు.

ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్ దేవ్
- సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి సింగ్ దేవ్, మంత్రి పూజారి, కలెక్టర్ తదితరులు



ధాన్యం మండీ వద్ద వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి

రాయగడ: సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్ దేవ్ అన్నారు. ఈయన శుక్రవారం రాయగడలో పర్యటించారు. చైతీ ఉత్సవాలకు హాజరయ్యేందుకు ఇక్కడకు వచ్చిన ఆయన చైతీ ఉత్సవాలు తాత్కాలికంగా రద్దు కావడంతో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో రాత్రి తొమ్మిది గంటలకు అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై సుదీర్ఘంగా సమీక్షించిన డిప్యూటీ సీఎం ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేరితేనే అవి సఫలీకృతమవుతాయని అన్నారు. అందుకు ప్రతీ ఒక్క అధికారి బాధ్యతతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం అవాస్, సడక్ యోజన వంటి పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల ఆదరణతో అధికారంలోకి వచ్చిన బీజేపీ వారి సమస్యలను తీర్చడం కోసం అహర్నిషలు కృషి చేస్తోందని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో మరిన్ని మార్పులు అవసరమన్నారు. రహదారులను మెరుగు పరచాలని.. అందుకు అవసరమయ్యే నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

బోగస్ రేషన్ కార్డులను ఏరివేయాలి

పేద, బడుగు వర్గాల ఆర్థిక స్థితిగతులను పరిగణంలోకి తీసుకున్న ప్రభుత్వం అర్హత గల ప్రతీ రేషన్‌దారుడికి సబ్సిడీ బియ్యం ఇతరత్రా వస్తువులు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. బోగస్ రేషన్ కార్డుల ఏరివేతపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలాఉండగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఓర్మాస్ దార్వా ఎంతమంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు ఆర్థిక సాధికారితను సంపాదించుకోగలిగారని.. అందుకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన రాయగడ జిల్లాలో ఉపాధి అవకాశాలు మరిన్ని కల్పించి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతేనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని.. అందుకు పరిశ్రమలను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. అంతకుముందు ఇటీవల జిల్లాలో ప్రారంభమైన ధాన్యం మండీలకు సంబంధించి స్థానిక ఆర్ఎంసీ ప్రాంతంలో ఉన్న ధాన్యం మండీలను ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్‌తో పాటు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి సురేష్ పూజారి పరిశీలించారు. మండీ వద్దకు వెళ్లి ఇప్పటి వరకు ఎంత మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు, ధాన్యం సేకరణ లక్ష్యం, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి, ఎస్పీ శ్వాతి ఎస్ కుమార్, ఏడీఎం భాస్కర రైతా, జెడ్పీ సీడీవో అక్షయ కుమార్ ఖెముండో, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహాట ఉన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శ్రీకాకుళంకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పాందూరుకు చెందిన యతీరాజుల రాధాకృష్ణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

ఇంటి నుంచి మద్యం దుకాణానికి విద్యుత్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో ఒక మద్యం దుకాణానికి నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నుంచి విద్యుత్ వినియోగిస్తుండడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. నిబంధనల మేరకు మద్యం షాపుకు కేటగిరీ–2 మీటర్ ఉండాలి. అయితే మద్యం షాపు నిర్వహిస్తున్న వ్యక్తి ఇంటి నుంచి విద్యుత్ సరఫరా చేసుకొని వినియోగిస్తున్నారు. దీంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో డీఈ మల్లికార్జునరావు, ఏఈ వాసుదేవరావులు వెళ్లి పరిశీలించారు. ఇంటి నుంచి విద్యుత్ సరఫరా తీసుకున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని ఏఈ వాసుదేవరావు తెలిపారు. మరో దగ్గర ఉన్న కేటగిరీ–2 మీటర్ సిఫ్టింగ్‌కు పెట్టారని, అది ఆలస్యం కావడంతో ఇంటి నుంచి విద్యుత్ సరఫరా వినియోగిస్తున్నట్లు సదరు వ్యక్తి తెలిపారన్నారు. ఇలా వాడడం నేరమనే విషయాన్ని తెలియజేశామన్నారు. ప్రస్తుతం కనెక్షన్ తొలగించడం జరిగిందన్నారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు



మహిళను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

సోంపేట: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది మండలంలో శనివారం దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని సీఐ కె.బేబి తెలిపారు. ఎం.జీ.పురం గ్రామంలో దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారా ప్యాకెట్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొరంజిభద్ర గ్రామంలో 10 లీటర్ల నాటుసారాతో మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. మందస మండలం రామరాయి గ్రామంలో 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. దాడుల్లో సోంపేట, పలాస, శ్రీకాకుళం సిబ్బంది పాల్గొన్నారు.

తలనీలాల వేలం ఖరారు

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రానున్న ఏడాది పాటు తలనీలాల హక్కులకు గాను నిర్వహించిన వేలం పాటను అనంతపురం జిల్లా హిందూపురం వ్యాపారి ఎస్.నాగరాజు రూ.70,02,000 మొత్తానికి దక్కించుకున్నారు. శనివారం ఆలయ మండపాల్లో తలనీలాలు, కొబ్బరిముక్కలు, ప్రసాద రసవర్గాలకు ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో శ్రీకూర్మం ఈవో గురునాథరావు సమక్షంలో వేలం నిర్వహించారు. కొబ్బరిచెక్కల వేలం పాటకు ఒకే పాటదారుడు హాజరుకావడంతో నిబంధనల ప్రకారం వాయిదా వేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అలాగే కొంతకాలం క్రిందట స్టాకుగా ఉన్న తలనీలాలకు వేరుగా పాట నిర్వహించినప్పటికీ...మార్కెట్ రేటు ప్రకారం కూడా పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎఫ్ చేతివాటంపై దర్యాప్తునకు సన్నద్ధం

టెక్కలి: మండలంలోని గూడేం పంచాయతీ పరిధిలో వెలుగు సీఎఫ్ గంగయ్య చేతివాటం ప్రదర్శించి నకిలీ బ్యాంకు రశీదులను సృష్టించి స్వయం సహాయక సంఘాల డబ్బులను కాజేసిన బాగోతంపై వెలుగు అధికారులు ఆడిట్ సిబ్బందితో దర్యాప్తు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు శనివారం సాక్షిలో ప్రచురితమైన 'బ్యాంకు రశీదుల ఫోర్జరీ' కథనంతో వెలుగు సిబ్బందిలో కదలిక మొదలైంది. కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సీఎఫ్ గంగయ్యకు స్థానిక వెలుగు అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ, ఆయన హాజరు కాకపోవడంపై ఈ మోసంపై మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా యూనియన్ బ్యాంక్ టెక్కలి బ్రాంచ్‌కు సంబంధించి నకిలీ రశీదులు సృష్టించిన వైనంపై ఆయా బ్యాంకు అధికారులు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంపై భిన్నమైన సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా పంచాయతీ పరిధిలో పెద్ద మొత్తంలోనే ఈ మోసం బయటపడే అవకాశాలు ఉన్నాయని ఆయా గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిగితే తప్పా ఈ నకిలీ రశీదుల వ్యవహారం కొలిక్కిరాదు.



సంయుక్త స్నాతకోత్సవ వేదికపై ప్రముఖులు

ఉత్సాహంగా స్నాతకోత్సవం

- ఐఐటీ భువనేశ్వర్‌లో 1388 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం



ప్రసంగిస్తున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



సంయుక్త స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు

భువనేశ్వర్: స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) 12, 13వ సంయుక్త స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. సంస్థ డైరెక్టరు ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ కాన్వొకేషన్ నివేదికను విడుదల చేశారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన 1,388 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలతో ప్రత్యేకంగా అభినందించారు. పట్టాలు సాధించిన వారిలో 8 శాతం పీహెచ్‌డీ, 19 శాతం ఎంటెక్, 14 శాతం ఎంఎస్సీ, 14 శాతం డ్యూయల్ డిగ్రీ (బీటెక్, ఎంటెక్), 45 శాతం బీటెక్ అభ్యర్థులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమర్శల్ని సానుకూలంగా మలచుకుంటే నేటి ఉత్తీర్ణులే రేపటి అత్యద్భుత పరిశోధకులు, ఆవిష్కర్తలుగా ప్రపంచ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. ఉన్నత విద్యాభ్యాసం, విశేష మేధా శక్తితో సాధించిన ఉత్తీర్ణత నామమాత్రంగా ధనార్జన, జీవనోపాధికి పరిమితం కావడం ఎంత మాత్రం సరికాదన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ యువతను అధ్యాపకులు వెన్నంటి ప్రోత్సహించాలన్నారు. సరికొత్త పారిశ్రామిక విప్లవకారులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు.



రాష్ట్రపతి బంగారు పతకంతో ఉత్తీర్ణత సాధించిన హర్ష్ సింగ్ జదోన్

విద్యాభ్యాసం ఆవలి తీరంలోని పరిశోధనలు ప్రచురణలతో పుస్తకాలకు పరిమితం కాకుండా సభ్య సమాజం రేపటి జీవనం కోసం నేడే బీజం నాటాలన్నారు. 2036 నాటికి వికసిత ఒడిశా, 2047 నాటికి వికసిత భారత్ సంకల్పానికి వారధిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అజిత్ కుమార్ మహంతి, భారత ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, భారత ప్రభుత్వ వైజ్ఞానిక సలహాదారుడు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, ఐఐటీ భువనేశ్వర్ పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రక్కులు ఢీ

- ఇద్దరు సజీవ దహనం

భువనేశ్వర్: కలహండి జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు ట్రక్కులు ఎదురెదురగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఢీకొన్న ట్రక్కులు అకస్మాతుగా మంటలు వ్యాపించి బూడిదయ్యారు. ఈ ఘటనలో డ్రైవరు, హెల్పరు సజీవ దహనం అయ్యారు. మరో ట్రక్కు డ్రైవర్ జాడ లేదని సహాయక బృందం సభ్యులు తెలిపారు. కలహండి పాస్తికుడి గ్రామం సమీపంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కలహండి టౌను ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రక్కుల్లో బొగ్గు, బియ్యం రవాణా చేస్తున్నట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు.



మంటల్లో దగ్ధమైన ట్రక్కులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 1వ వార్డు మొగిలిపాడు జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కనున్న సాహూ దాబా వద్ద భోజనాలకు అనేక లారీలు నిలిపారు. అయితే ఆ సమయంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొన్నాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ఒడిశా రాష్ట్రం సుర్లా గ్రామానికి చెందిన కృష్ణారావుగా గుర్తించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నౌపడ నుంచి టెక్కలి వైపు వస్తున్న వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. సారవకోట మండలం కిన్నెరవలస గ్రామానికి చెందిన కె.జగన్నాథం నౌపడ నుంచి వస్తూ రావివలస జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

చైన్ స్నాచింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని పట్టపగలు మహిళ మెడలో చైన్‌ను బైక్ మీద వచ్చిన ఇద్దరు యువకులు దొంగలించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు గ్రామానికి చెందిన బొడ్డేపల్లి అమ్మాయమ్మ లక్ష్మీడిపేట రోడ్డులో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలు సమయంలో గొర్రెలు మేపుతోంది. నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి పునాదులపై రోడ్డు పక్కన మహిళ కూర్చుంది. ఈ సమయంలో ఇద్దరు బైక్‌పై వచ్చి చైన్ తెంచుకొని పారిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ సంబరానికి వేళాయె..!





ప్రాజెక్టు పనితీరును చూపిస్తున్న విద్యార్థినులు(ఫైల్)

- రేపు మండల స్థాయి సైన్స్ పోటీల నిర్వహణ
- మూడు కేటగిరిల్లో ప్రాజెక్టుల ప్రదర్శన
- విజేతలకు జిల్లా పోటీలకు నేరుగా అర్హత

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ నడుం బిగించింది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు రంగం సిద్ధమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొనవచ్చు. ఈనెల 30వ తేదీన మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల ప్రాజెక్టులు, జనవరి 3వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధిస్తాయని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 3,034 పాఠశాలలు ఉండగా.. వీటిలో 2,74,719 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో 601 ఉన్నత పాఠశాలల్లో 1.58 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. వీరంతా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు అర్హులు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో...

ఈనెల 30వ తేదీన ఎంపిక చేసిన పాఠశాలల్లో మండల స్థాయి పోటీలు జరగనున్నాయి. విద్యార్థి వ్యక్తిగత ప్రాజెక్టు, గ్రూప్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్టుల వారీగా మూడు కేటగిరిల్లో ప్రదర్శనలో పాల్గొనవచ్చు. సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు శ్రీకాకుళం ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి నోడల్ అధికారిగా నియామకం అయ్యారు. ఈ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్, ఎర్త్/స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్, బయో సైన్స్/బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై పాల్గొనాల్సి ఉంటుంది. వీటిలో ఎంపికైనవారు జిల్లాస్థాయిలో జరిగే ప్రదర్శనకు అర్హత సాధిస్తారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్నాయి. జిల్లాస్థాయి సైన్స్ అధికారిగా ఎస్.కుమారస్వామి వ్యవహరిస్తూ ఏర్పాట్లను పూర్తిచేస్తున్నారు.

సూచనలు తప్పనిసరి

మండల, జిలాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలి. జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు పనితీరును వివరించగలిగేలా వారిని తీర్చిదిద్దాలి. సైన్స్ ప్రాజెక్టుల సందర్శన పోటీల్లో పాల్గొన్నవారు శాస్త్రీయ దృక్పథం, సామాజికంగా ప్రయోజనకారంగా ప్రాజెక్టులను తీర్చిదిద్దుకోవాలి. కనీస ప్రమాణాలు కలిగి, ప్రాజెక్టులు నాణ్యమైనవిగా ఉండేవిధంగా తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో థర్మాకోల్‌ను ఎట్టిపరిస్థితిల్లోనూ వినియోగించకూడదని అధికారులు చెబుతున్నారు. థర్మాకోల్‌తో తయారైనటువంటి నమూనాలను ప్రదర్శనలకు అనుమతించబోమని సైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనాలని డీఈవో తిరుమల చైతన్య స్పష్టం చేస్తున్నారు.

విజయవంతం చేయాలి



పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికిగాను మండలస్థాయి, జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించాం. రేపు మండలస్థాయి, జనవరి 3న జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయి. హెచ్‌ఎంలు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం



సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు(ఫైల్)

అప్పర్ కొలాబ్ డ్యామ్‌కు మరమ్మతులు



డామ మరమ్మత్తుల కారణంగా నీరు చేరని సతిగుడ జలాశయం

- తాగునీటికి కటకటలాడుతున్న జయపురం పట్టణ ప్రజలు

జయపురం: జయపురం పట్టణ ప్రజలకు తాగునీరు సమకూర్చుతున్న సతిగుడ జలాశయంలో నీటి కొరత ఏర్పడింది. అప్పర్ కొలాబ్ జలవిద్యుత్ ప్రాజెక్టు అత్యవసర మరమ్మతులు చేపట్టడం వలన సతిగుడ జలాశయంలోనికి నీరు నిలిచిపోవడంతో నీటి కొరత ఏర్పడింది. సతిగుడ జలాశయంలో అవసరమైనంత పరిమాణంలో నీరు లేకపోవటం వలన శుక్రవారం సాయంత్ర నుంచి శనివారం రాత్రి వరకు 30 గంటల పాటా తాగునీటి సరఫరాను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నిలిపి చేసింది. అప్పర్ కొలాబ్ డ్యామ్ మరమ్మతులు పూర్తయిన తరువాత నీరు విడిచిపెడితే సతిగుడ జలాశయంలోనికి చేరుతుంది. నీరు చేరిన తరువాత పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందని పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి బిచిత్రానంద బెహర వెల్లడించారు.

ప్రస్తుతం వాటర్ టాంక్‌లో ఉన్న నీటిని కొంచెం, కొంచెంగా విడుదల చేస్తామన్నారు. జయపురం పట్టణ ప్రజలకు రోజుకు 15 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉంది. 40 ఏళ్ల కిందటి నుంచి ఏనుగుల శాల ప్రాంతంలో గల వాటర్ ఫిల్టర్ ప్లాంట్ నుంచి జయపురం పట్టణ ప్రజలకు తాగు నీరు సరఫరా చేయటం జరుగుతుంది. పి.హెచ్.డి నీటిపై పట్టణంలో దాదాపు 11 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి.

ఆయుర్వేద వైద్యుడు పరమేశ్వరకు ఘన సన్మానం

జయపురం: జయపురంలో ఆయుర్వేద ప్రాక్టీషనర్ పరమేశ్వర పాత్రోను ధర్మఘడ్‌లోపి ఓ ప్రైవేట్ టి.వి.చానల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ నెల 26వ తేదీన ధర్మఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో పాత్రోను ప్రశంసాపత్రం, మెమెంటోతో సత్కరించింది. పరమేశ్వర పాత్రో ఆయుర్వేద వైద్య ప్రచారంతోపాటు వైద్యాన్ని ప్రజల వద్దకు చేర్చేందుకు జీవితమంతా అంకితం చేసి, వైద్య విస్తరణకు విస్తృత కృషిచేస్తున్నారని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నందుకు అభినందిచారు. నవరంగపూర్ జిల్లా ఆయుర్వేద వైద్యులు శ్రీకాంత పాత్రో, జినియరాణి మహంకుడోలను కూడా ప్రశంసాపత్రాలతో నిర్వాహకులు సన్మానించారు.



పరమేశ్వర పాత్రోను సన్మానిస్తున్న నిర్వాహకులు

సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపాలి

- ట్రిపుల్ సీ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ నాగవీర్ ఉండవల్లి
- టెక్కలి ఆదిత్యలో ఆవిష్కార్ హేకతాన్ ప్రారంభం

టెక్కలి: సమాజంలోని వివిధ రకాల సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేవిధంగా ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలు చేయాలని ట్రిపుల్ సీ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ నాగవీర్ ఉండవల్లి ఆకాంక్షించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆవిష్కార్ హేకతాన్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న నైపుణ్యత అంశాలను వ్యక్తీకరణ చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా ఉన్న సమస్యలకు సాంకేతికత ద్వారా పరిష్కారం చూపడమే సాంకేతిక విద్య ఆవశ్యకత అన్నారు. భవిష్యత్ కాలమంతా కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) హవా కొనసాగుతుందని వెల్లడించారు. ఏరంగంలోనైనా రాణించాలంటే స్కిల్ ఐక్యూ, రోల్ ఐక్యూ విధిగా ఉండాలన్నారు. స్కిల్ ఐక్యూ అంటే తెలుసుకున్న నైపుణ్యతను బహిర్గతం చేయడం, రోల్ ఐక్యూ అంటే ఒకే వ్యక్తి ఏదైనా ఒక ప్రాజెక్టును రూపకల్పన చేసి పెట్టడమేనని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో దేశంలోని 19 రాష్ట్రాల నుంచి 50 వరకు విద్యార్థి బృందాలు పాల్గొన్నాయని వెల్లడించారు. హాజరైన విద్యార్థుల బృందాలు 48 గంటల పాటు వారి ఆలోచనలను పరిశోధనలకు రూపకల్పన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, అసోసియేట్ డీన్లు జి.సతీష్‌కుమార్, ఎంవీఎస్ సంతోష్‌కుమార్, జె.సురేష్‌కుమార్, గిరీష్‌కుమార్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కార్ హేకతాన్ ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం

జిల్లా జడ్జిని కలిసిన ఏపీపీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కింజరాపు శ్రీనివాసరావు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాను మర్యాదపూర్వకం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ, ఫోక్సో కోర్టు పీపీ వాన కృష్ణచంద్, జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, సీనియర్ న్యాయవాదులు పాలిశెట్టి మల్లిబాబు, తంగి శివప్రసాదరావు, తెలుగు రాజారావు, బార్ సెక్రటరీ వై.ప్రసన్నకుమార్, కొమ్ము రమణమూర్తి, ఆగూరు ఉమామహేశ్వరరావు, బి.ఎస్.చలం, సత్యారావు, శంకరరావు, మోహనరావు పాల్గొన్నారు.



జునైద్ అహ్మద్ మౌలానాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీపీ శ్రీనివాసరావు

ఏపీఎం రజనీ అత్యుత్సాహం

- వీవోఏను తొలగిస్తూ మౌలిక ఆదేశాలు
- కార్యాలయంలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీకాకుళం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీకాకుళం వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏపీఎం కె.రజనీ వీవోఏలపై పెత్తనం చెలాయిస్తు, టీడీపీకి అనుకూలంగా ఉన్నవారికి ఒకలా పనిచెప్పడం, వ్యతిరేకంగా ఉన్నవారికి వార్నింగ్‌లు ఇవ్వడంతో పాటు అర్ధాంతరంగా తొలగించడం చేస్తోందని మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దిరోజులు క్రితం ఉన్నతాధికారులకు తెలియకుండానే నైరా పంచాయతీ పరిధి వెంకటాపురం, చల్లవానిపేట గ్రామాలకు సంబంధించి వీవోఏగా పనిచేస్తున్న బొబ్బాది రాధాకుమారిని అర్ధాంతరంగా తొలగిస్తూ మౌలిక ఆదేశాలు జారీ చేసినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఆమె కార్యాలయానికి వెళ్లి నిలదీశారు. ఈ విషయంపై ఏపీఎంను వివరణ కోరగా రెండు వారాల క్రితం రాధాకుమారి వద్ద రికార్డులు తీసుకోవడం వాస్తమేనన్నారు. ఆమెపై గ్రామంలో కొంతమంది ఫిర్యాదులు ఇవ్వడంతో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నైరా పంచాయతీ పరిధిలో రెండు వర్గాల మధ్య రాజకీయ రగడ నడుస్తోందని, తాను ఎవరీని నియమించలేదన్నారు. అయితే వేరేవారి దగ్గర రికార్డులు ఎలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.



కార్యాలయంలో ఏపీఎంను నిలదీస్తున్న దృశ్యం

పాఠశాలలపై విశ్వాసం పెంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగం రోజురోజుకీ వ్యాపారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాల్సిన బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)లు, ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎన్నికైన నూతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి గొప్పపౌరులగా విద్యార్థులను అందించాలంటే సర్కారీ బడుల్లో మనం ఇచ్చినటువంటి అభ్యాసంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా గ్యారెంటీ ఇచ్చే వనరుల కేంద్రాలుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తు తరాలకు ఇచ్చే సంపద విద్య ఒక్కటేనని, దానికి పాఠశాలలు వేదికలు కావాలన్నారు. పలుచోట్ల అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నటువంటి ఈరోజుల్లో, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమష్టిగా సామాజిక రుగ్మతలపై పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్నటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వారధులగా ఎస్ఎంసీలు ఉండాలని కోరారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే యంత్రాంగం సక్రమంగా పనిచేసినప్పుడే సాధ్యపడుతుందన్నారు. డ్రగ్స్ మహమ్మారి విస్తరనపై కీలకమైన సూచనలు చేస్తూ దీనిపై ఓ ప్రత్యేకమైనటువంటి పోరాటం చేయాల్సిన తరణం ఆసన్నమైందన్నారు.

క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో పరీక్ష నిర్వాహకులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను స్థానిక పూల్‌బాగ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శనివారం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించే పరీక్షలు నిర్వహించారు. కవాతు ప్రదర్శనను పరీక్షించారు. అనంతరం ఉత్తమ కవాతు ప్రదర్శన, సామర్థ్యాలను చూపిన నలుగురు విద్యార్థులను ఎంపిక చేసారు. ఎంపిక పరీక్షల నిర్వహణ బాధ్యతను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం కార్యదర్శి వాక చిన్నంనాయుడు తీసుకున్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎస్.కనకలక్ష్మి, డీటీసీ ప్రవీణ్‌కుమార్, డీటీసీ సూరిబాబు, ఏఎస్‌ఓసీ దుర్గా నాగేశ్వరరావు, గౌరవ వైస్ ప్రెసిడెంట్లు సీహెచ్ నారాయణమూర్తి, వి.త్రినాధ్‌నాయుడు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆవుల కళేబరాలు



లేఅవుట్ గోడ సమపంలో పడి ఉన్న ఆవుల కళేబరాలు

కొత్తవలస : మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో కొత్తవలస – విజయనగరం రోడ్డును ఆనుకొని వున్న శ్రీకృష్ణనగర్ లేఅవుట్ ప్రహరి పక్కన అనుమానాస్పద స్థితిలో రెండు ఆవుల కళేబరాలను శనివారం స్థానికులు గుర్తించారు. ఈ ఆవులు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులవి కావని స్థానికులు చెబుతున్నారు. కాగా గత కొద్ది నెలలుగా కొత్తవలస మండలం కేంద్ర బిందువుగా పశువుల అక్రమ రవాణ, మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే సమయంలో ఈ ఆవులు మృతి చెంది వుంటాయని, దీంతో ఇక్కడికి తెచ్చి పడేసారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆవుల మృతదేహాలకు సంబంధించి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే అసల విషయాలు బయటపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.


వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకుని మృతి చెందిన అప్పల నాయుడు

విజయనగరం క్రైమ్: మండలంలోని ధర్మపురిలో గల కెల్లవీధిలో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి గ్రామానికి చెందిన చెల్లూరి అప్పల నాయుడు (41) విజయనగరం పీడబ్ల్యూ మార్కెట్‌లో కళాసీగా పని చేస్తున్నాడు. మద్యం అలవాటు ఉన్న నాయుడు తరచూ భార్యాపిల్లలతో తగాదా పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో భార్య తన పిల్లలను తీసుకుని అయ్యన్నపేటలోని పుట్టింటికి వెళ్లిపోవడం, పెద్దమనుషులు కలుగజేసుకుని ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చడం తరచుగా జరుగుతూ ఉండేది. ఈ నెల 25న మద్యం సేవించి అప్పలనాయుడు భార్యతో తగాదా పడ్డాడు. దీంతో ఆమె పిల్లలతో పాటూ పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన అప్పలనాయుడు శుక్రవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకున్నాడని తెలిపారు. శనివారం ఉదయం అప్పలనాయుడు సోదరుడు నారాయణరావు ఇంటికి వెళ్లి తలుపులు తీసి చూడగా అప్పలనాయుడు ఫ్యాన్‌కి ఉరివేసుకు ని విగతజీవిగా కనిపించాడని తెలిపారు. దీంతో సోదరుడు నారాయణరావు ఇచ్చిన ఫిర్యా దు మేరకు రూరల్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్ మధ్యలో మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద రీతిలో రైల్వే ట్రాక్ మధ్యలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని జీఆర్‌పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు శనివారం తెలిపారు. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు, 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు కలిగిన మగ వ్యక్తి మృతదేహం విజయనగరం, కోరుకొండ రైల్వే స్టేషన్‌ల మధ్య జొన్నవలస రైల్వేగేట్ దగ్గరలో రైల్వే ట్రాక్ మధ్యలో పడి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నంబరునుగాని, జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లోగాని సంప్రదించాలని సూచించారు.

కుదేలైన కూరగాయల రైతులు

- వరుస తుఫాన్‌లతో అపార నష్టం
- ఊటబారి దెబ్బతిన్న మొక్కలు
- దిగుబడి అనుమానమే అంటున్న రైతులు
- జిల్లాలో 800 పైబడి హెక్టార్లలో కూరగాయల పంటల సాగు– జిల్లాలో సుమారు రూ.1.70కోట్ల వరకు పంట నష్టం
- పంట నష్ట పరిహారంతో ఆదుకోవాలని వేడుకోలు

రామభద్రపురం: బంగాళాఖాతంలో డిసెంబర్ నెలలో ఏర్పడిన వరుస తుఫాన్‌లతో కురిసిన వర్షాలతో కూరగాయల రైతులు కుదేలయ్యారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు పూర్తిగా పాడై రైతులకు అపార నష్టం వాటిల్లింది. కుటుంబమంతా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తమ కళ్లెదుటే పాడవడం చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి సహకరించక తుఫాన్ వల్ల రోజుల తరబడి కురుస్తున్న వర్షాలు కారణంగా పంట భూములలో నీరు చేరి ఊట పట్టడంతో కూరగాయ పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. జిల్లాలోని రామభద్రపురం, బొబ్బిలి, దత్తిరాజేరు, జామి, మెంటాడ, ఎస్.కోట, పూసపాటిరేగ, డెంకాడ, గరివిడి, గుర్ల, చీపురుపల్లి, బాడంగి మండలాల్లోని రైతులు అధికంగా కూరగాయలు పండిస్తున్నారు. 800 నుంచి 900 ఎకరాలలో వంగ, టమాట, బెండ, చిక్కుడు, కాలీఫ్లవర్, క్యాబేజీ, దొండ, క్యారెట్, బీట్‌రూట్ తదితర పంటలతో పాటు ఆకు కూరలు 800 నుంచి 900 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పంటలు ఏపుగా పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్న సమయంలో వరుస తుఫాన్ల ప్రభావం పడింది. దీంతో పంట పొలాల్లో నీరు చేరి భూమి ఊట పట్టడంతో వేరు కుళ్లు తెగులు సోకి మిరప, వంగ, టమాట, దుంప జాతులతో పాటు ఆకుకూరల పంటలు పాడవుతున్నాయి. కాలీఫ్లవర్‌లో నీరు చేరి ఎండ తగలక కుళ్లిపోతుంది. ఉల్లిలో భూమి వకపట్టడంతో పాటు కాడలు విరిచిన తర్వాత విరిచిన కాడల ద్వారా నీరు లోపలకు దిగి మొత్తం ఉల్లి కుళ్లిపోతుంది. కూరగాయలకు మచ్చ తెగులు సోకి నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. చిక్కుడు, దొండ, కాకర తదితర తీగ జాతి పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకి పూత, పిందె కింద రాలిపోతున్నాయి. వివిధ రకాల చీడపీడలు ఆశించి నాశనం చేస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తుఫాన్ కారణంగా ఎకరానికి రూ.20 వేల చొప్పున 800 నుంచి 900 ఎకరాలకు సుమారు రూ.1.70 కోట్లు నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు. ప్రకృతి విపత్తులకు తెగుళ్ల సోకడంతో పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి నెలకొంది. తాము అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఎంతో ఆశతో కష్టపడి పండించిన పంట తుఫాన్ల కారణంగా నష్టాల బారిన పడుతున్నాయని వాపోతున్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



కుళ్లిపోతున్న ఉల్లిని దిగాలుగా చూపుతున్న రైతు మామిడి రామకృష్ణ

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రామభద్రపురం గ్రామానికి చెందిన మామిడి రామకృష్ణ. ఇతడు సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో ఉల్లి సాగు చేస్తూ దాదాపు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. తుఫాన్ వల్ల ఎంతో కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో చూస్తుండగానే కుళ్లిపోతుంది. పెట్టుబడి పోవడమే కాకుండా లాభం రావల్సిన మరో రూ.40వేలు పోయే పరిస్థితి నెలకొంది. పంటల సాగుకు అధికంగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కుటుంబమంతా ఆరుగాలం కష్టపడినా ప్రకృతి సహకరించడం లేదని కుళ్లిపోతున్న ఉల్లి పంటను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



తుఫాన్ ప్రభావంతో పూర్తిగా పాడైన టమాట పంట



చనిపోతున్న మిరప పంటను చూపుతున్న రైతు మామిడి సత్యనారాయణ



కుళ్లిపోయిన ముల్లంగి దుంపలు చూపుతున్న మహిళా రైతు పి.కుమారి

తీవ్రంగా నష్టపోయాం



నేను చిన్నప్పటి నుంచి కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. ఇంతగా రోజులు తరబడి వర్షాలు కురవడం ఎప్పుడూ చూడలేదు. వాతావరణ పరిస్థితుల కారణంగా అధికంగా కూరగాయల పంటలు నష్టపోవడం ఇదే మొదటసారి చూస్తున్నాను. నోటికాడికి వచ్చిన అన్నం ముద్దను తీసేసిన చందంగా ఉంది. అప్పు చేసి రూ.25 వేలు పెట్టుబడి పెట్టి అరకెరా విస్తీర్ణంలో చిక్కుడు వేసాను. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ కారణంగా తెగుళ్ల బెడదతో పంట పాడవడంతో అప్పులు పాలవుతున్నాను.

– కోట అప్పన్న, రైతు, రామభద్రపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం చేసేది. దాంతో పెట్టుబడుల కోసం రైతులకు అప్పుల బాధ తప్పేది. ఇప్పుడు ఈ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. తుఫాన్ కారణంగా కూరగాయ పంటలు మా కళ్ల ఎదుటే నాశనమయ్యాయి. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– మామిడి శ్రీనివాసరావు, కూరగాయల రైతు, రామభద్రపురం

పరిశీలిస్తాను...



సాధారణంగా నీరు అధికంగా ఉన్న భూముల్లో వేరు కుళ్లు తెగుళ్లు సోకుతుంది. కూరగాయల పంటల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు తీసేయాలి. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి పంట నష్టాలను అంచనా వేసి, నివేదికలు పంపిస్తాం. ఉద్యాన శాఖాధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఏపీఎస్‌వీ జమదగ్ని, జిల్లా ఉద్యానశాఖ అధికారి

విధుల్లో అలసత్వం వద్దు

- పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ సూచన

విజయనగరం క్రైమ్: ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో చేపడుతున్న స్టైఫండరీ సివిల్ పోలీసు కానిస్టేబుల్ (పురుషులు/మహిళలు), ఏపీఎస్‌పీ పురుషులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియలో పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై ఎస్పీ వకుల్ జిందల్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అవగాహన కల్పించారు. నియామక ప్రక్రియలో విధులు నిర్వహించేందుకు ఎంపిక చేసిన పోలీసు అధికారులు, మినిస్టీరియల్ అధికారులు, సిబ్బందితో మమేకమై వారు నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ చాలా సున్నితమైనదని, ప్రతీ ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వద్దన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియామకాలు పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగానూ, సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు సర్టిఫికేషన్ పరిశీలన క్షుణ్ణంగా జరపాలని, ధ్రువపత్రాల పరిశీలనలో ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియామకాల ప్రక్రియ ప్రతీ రోజూ ఉదయం 4 గంటలకు ప్రారంభమవుతుందని, అభ్యర్థుల హాల్‌టికెట్స్‌తో పాటూ, తమ పుట్టిన తేదీ, విద్యార్హతలు, రిజర్వేషన్‌లను ధ్రువపర్చే అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వీటితో పాటూ గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేసిన ఒక సెట్ జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ఏదైనా కారణంతో అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని రావడంలో విఫలమైతే, వారికి రిక్రూట్‌మెంట్ జరిగే మరో రోజున అవకాశమివ్వడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసు కానిస్టేబుల్ నియామకాల ప్రక్రియకు కేటాయించబడిన పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్‌కి గుర్తింపు కార్డులను ఇస్తారని, వారు మాత్రమే పరేడ్ గ్రౌండ్‌లో విధి నిర్వహణ నిమిత్తం ఉండాలన్నారు. అభ్యర్థులు మినహా, ఇతరులెవ్వరికీ ప్రవేశం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు చేపట్టిన ఏర్పాట్లను ఎస్పీ ఇతర పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నియామక ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, వైద్య, పారా మెడికల్ సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పోలీసు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పే దళారీల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టిఎస్.శ్రీనివాసరావు, కె.థామస్‌రెడ్డి, ఏఓ పి.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టాల్సిన విధులపై సూచనలు చేస్తున్న ఎస్పీ

నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌పై వేటు

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్

విజయనగరం క్రైమ్: వాహనాలు నడిపే వారు నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌పై వేటు వేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డి.మణికుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతకే ప్రాధాన్యత కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ఆటో, క్యాబ్, టాక్సీల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించి ఓవర్ లోడ్ చేస్తే అటువంటి వాటిని గుర్తించి వారి డ్రైవింగ్ లైసెన్స్‌పై సస్పెన్షన్ వేటు వేస్తామన్నారు. మూడు నెలల పాటూ డ్రైవింగ్ చేయడానికి అనర్హుడిగా గుర్తిస్తామన్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇప్పటివరకు 100 వాహనాలపై వేటు వేసామన్నారు. పొల్యూషన్ చెకింగ్‌లు కూడా ఇప్పటివరకూ 25వేలకి పైగా వాహనాలకు చెక్ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై అక్టోబరులో 444 కేసులు, నవంబరులో 1184 కేసులు డిసెంబరులో ఇప్పటివరకూ 919 కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో ప్రమాదాలు సంభవించే రహదారి ప్రాంతాల్లో 40 వరకూ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాథమిక చర్యలు చేపట్టామన్నారు. నిబంధనలకు అనుగుణంగా వెళ్లండి.. క్షేమంగా ఇంటికి చేరండనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు.



డి.మణికుమార్

ముగిసిన 'అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాప్'



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (కంప్యూటర్ సైన్స్) విభాగం ఆధ్వర్యంలో 'అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్' పేరుతో వారం రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. అమెజాన్ నిపుణుల నేతృత్వంలో ప్రాక్టికల్ సెషన్లతో క్లౌడ్ స్టోరేజ్, కంప్యూటింగ్ మరియు డేటాబేస్ మేనేజ్‌మెంట్‌తో సహా అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అవగాహన కలిగించాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలనే ఉత్సాహం టెక్ ప్రపంచంలో మీకు అనేక తలుపులు తెరుస్తాయనడంలో సందేహం లేదని అన్నారు. వర్క్‌షాప్‌లో నేర్చుకున్న శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరామమూర్తి, కృత్రిమ మేధస్సు, డెటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకొన్న బంగారం అప్పగింత



బాధితురాలు ఇందిరకు బంగారు వస్తువులు అప్పగిస్తున్న సీఐ శంకరరావు, ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లి: పోగొట్టుకున్న బంగారాన్ని సీసీ కెమెరాలు ద్వారా నిఘా పెట్టి పట్టుకుని తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ ఎల్.దామోదరరావు చెప్పారు. ఈ మేరకు శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండున్నర తులాల బంగారు ఆభరణాలను బాధితురాలు గుడ్ల ఇందిరకు సీఐ శంకరరావు చేతులు మీదుగా అందజేసారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ మాట్లాడుతూ వారం రోజులు క్రితం పట్టణానికి చెందిన గుడ్ల ఇందిర తన కుటుంబ సభ్యులతో కలిసి శివరాం రోడ్‌లో వెళ్తుండగా ఆమె బ్యాగులో ఉన్న మండ గొలుసు, చేతి రింగు జారి పడిపోయాయి. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీంతో సీసీ కెమెరాలు ద్వారా పరిశీలించగా బంగారు వస్తువులు తీసుకున్న గుర్ల మండలంలోని పెదబంటుపల్లి గ్రామానికి చెందిన మజ్జి గోవింద్ అనే వ్యక్తిని గుర్తించి విచారించారు. దీంతో ఆయన వస్తువులు తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు బాధితురాలు గుడ్ల ఇందిరకు ఆ బంగారు వస్తువులను అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ దామోదరరావు, కానిస్టేబుల్ రమణను సీఐ శంకరరావు అభినందించారు.

మద్యం పార్టీలకు అనుమతి తప్పనిసరి

విజయనగరం క్రైమ్: విజయనగరం, మన్యం జిల్లాల్లో ప్రజలు, వ్యాపారులు నూతన సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో లిక్కర్ పార్టీలు చేస్తే ప్రొహిబిషన ఎక్సైజ్ శాఖ ద్వారా ఈవెంట్ పర్మిషన్ తీసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిషన్ కావాల్సిన వారు ముందుగా సంబంధిత ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించి, నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. పర్మిషన్ లేకుండా లిక్కర్ సరఫరా చేసినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చట్టరీత్యా నేరమని, అటువంటివారిపైనా, ఈవెంట్ యాజమాన్యాలపైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారున. పర్మిషన్ కావాల్సిన వారు విజయనగరం జిల్లాకు సంబంధించి ఎక్సైజ్ అధికారి 86396 76401 నంబర్‌ను... మన్యం జిల్లా ఎక్సైజ్ అధికారి 94906 42242 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి

- నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేయాలి
- 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్
- ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

విజయనగరం అర్బన్:

ప్రభుత్వ పథకాల నిధులను సక్రమంగా వినియోగించకొని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేయాలని 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలవాలని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శనివారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్వామా, పంచాయతీరాజ్ పనులు, అమృత సరోవర్, జల జీవన్ మిషన్, పీఎం జన్‌మన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, లక్‌పతి దీది, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎంఏవై, అమృత 2.0, సడక్ యోజన, నేషనల్ గోకుల్ మిషన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, గిరిజన సంక్షేమం, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. వివిధ కార్యక్రమాల అమలు, తీసుకున్న చర్యలు, లక్ష్య సాధన, భవిష్యత్ కార్యక్రమాలను అంకెలతో పాటు తెలియజేశారు. ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులను మార్చిలోపు శతశాతం వినియోగించుకొనేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఇళ్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. పథకాల ప్రగతిని ఆయా శాఖాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా మరింత ఎక్కువ మందికి వంద రోజుల పనిదినాలను కల్పించాలని, అలాగే సగటు వేతనాన్ని రూ.300కు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది నుంచే మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగాన్ని ప్రారంభించాలని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని దాని అవసరాలకు తగ్గట్టుగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సిద్ధం చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు, సంప్రదాయ ఇంధన వనరులను ఆదా చేసేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఒక వరమని అన్నారు. దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది వినియోగించుకొనేలా చూడాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు పి.అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్‌పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఆర్టీసీ ప్రాంతీయ ఛైర్మన్ దొన్ను దొర, ఎమ్మెల్సీ రఘురాజు, జిల్లా సీపీఓ పి.బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

దొరికిన దొంగలు



మాట్లాడుతున్న సీఐ రమణ (పక్కనే ముసుగులో నిందితుడు)

గజపతినగరం : మండలంలోని మధుపాడ గ్రామంలో ఈ నెల 26న తెన్నేటి నరసింహమూర్తి ఇంటితో పాటు ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి ఎవి.రమణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీకి పాల్పడిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన తూముల దాలయ్యగా గుర్తించామన్నారు. ఆయనతో పాటు చోరీలో మరో ఇద్దరు మైనర్ వ్యక్తులు కూడా ఉన్నారని వారిని శనివారం మధుపాడ పాలదారి చెరువు వద్ద చోరీ చేసిన వాటిని పంపకాలు చేసుకుంటుండగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ లక్ష్మణరావుతో పాటు మరో నలుగురు సిబ్బంది వెళ్లి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి మూడు కిలోల వెండి, రెండు కిలోల ఇత్తడి, ఒక టీవీ, సుమారు 10వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎఐ కె.లక్ష్మణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పసుకుడిలో ఏనుగులు



పసుకుడి వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామానికి ఏనుగుల గుంపు శనివారం చేరుకంది. రెండు రోజుల కిందట భామినిలోని వరిచేలను ధ్వంసం చేసిన ఏనుగులు.. వంశధార నది ఆవల ఉన్న ఒడిశా గ్రామాలకు నిన్న వెళ్లాయి. మళ్లీ నదిని దాటి పసుకుడి గ్రామానికి చేరుకోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

రిఫరల్స్ తగ్గించాలి

విజయనగరం ఫోర్ట్: వైద్యాధికారులు గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోగుల ఆరోగ్య పరిస్థితి అర్థం చేసుకోకుండా ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయడం, ఏదైనా సంఘటన జరిగినప్పుడు పక్కవారి మీద తోసేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మూడు నెలలుగా డయేరియా జిల్లా ప్రజలను పట్టి పీడిస్తోందని, ప్రజల సందేహాలను నివృత్తి చేసేలా వాస్తవాలను వెల్లడించి నమ్మకం కల్గించాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూసే బాధ్యత వైద్యాధికారులదేనని అన్నారు. ఆస్పత్రులకు వచ్చే వారిని తప్పనిసరి అయితేనే రిఫర్ చేయాలన్నారు. వైద్యులపై ఫిర్యాదులు వస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.